# పూర్తికాని గీతం

రచన :
శ్రీ ఎం. సూర్యనారాయణ.

ఊరికి దూరంగావుంటున్న ఆ యింట్లో రెండు కుటుంబాలు వుంటున్నాయి. ఒకటి యింటివారిది. రెండవ దాంట్లో ఒక కుఱ్ఱవాడు మాత్రమే వుంటున్నాడు.

ఆ పరిసరాల్లో అతని పుట్టు పూర్వోత్తరాలు ఎవరికీ తెలియవు. 24 ఏళ్ళ యువకుడు. ఎర్రగా పొడుగ్గా వుంటాడు. పెద్ద బలమయిన శరిర మేమీ కాదు. ఆకర్షణీయమయిన ముఖచ్ఛాయ. సంపన్న కుటుంబీకుడులా కన్పిస్తాడు కానీ, చాలా నిరాడంబరంగా వుంటాడు. అప్పుడప్పుడు ఒక వాద్య సంగీతం ఆ యింట్లోంచి వీన వచ్చేది. బుల్ బుల్ నుంచి వెలువడే ఆ వీనులవింపయిన సంగీతానికి అక్కడి ప్రజలు మంచి ఉత్సాహం వినేవారు.

* * *

సాయం సమయం సూర్యుడు పడమర దిక్కుగా పయనిస్తున్నాడు. ఈ యువకుడి చేతిలో ఒక బుల్ బుల్ వుంది. నడివడిగా గోదావరి గట్టుపై నడవసాగేడతను. తరంగాలకు దూరంగా ఇసుకగుట్టపై ఏకాంతంగా కూర్చున్నాడు.

బుల్ బుల్ తీగలను వ్రేళ్ళతో మీటేడు. క్షణంలో వాతావరణమంతా ఆ మృదు మధుర సంగీతంతో నిండిపోయింది.

* * *

పరుగెత్తుకొని వచ్చాడొక యువకుడు. 25 ఏళ్ళు వుంటాయ్. బలమైన శరీరం. కళ్లు కాంతిగా మెరుస్తున్నాయ్! చామన చాయ రంగు.

'ఓ! యంగ్ మ్యుజీషియన్!' గొంతుక ఎడారిలో పయనిస్తున్నవాడికి పిలచి ముంచి నీళ్ళు యిచ్చినప్పుడు బాటసారి చూసే కృతజ్ఞత ధ్వనించింది.

'అద్భుతంగా వాయించారు' అన్నాడా నూతన యువకుడు, యువకుడికి దగ్గిరిగా కూర్చుంటూ.

వాద్యాన్ని క్రిందపెట్టి నవ్వాడా యువకుడు.

'నిజంగా అద్భుతంగా వుంది. మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను నేను. పూర్తిగా వాయించరూ!' అడిగేడా నూతన యువకుడు.

యువకుడి కళ్ళు శూన్యంలోకి తిరిగాయి. ఆ సమయంలో అతని కళ్ళు రెండు అశ్రు బిందువుల్ని వర్షించాయ్.

నామాటలు మీకు కష్టం కల్గించినట్లయితే నన్ను క్షమించండి అన్నాడా నూతన యువకుడు.

'అబ్బే ఏమీ లేదండి.' అని కళ్లు తుడుచుకుంటూ, 'మీ రెవరో కానీ, ఎందుకో మిమ్మల్ని చూస్తుంటే ఏదో అనుబంధం వున్నట్లు అనిపిస్తోంది' అడిగేడు యువకుడు.

'అవును, మిమ్మల్ని చూసినప్పుడూ అలాగే అన్పించింది నాకు. నా పేరు రాజా' అన్నాడా నూతనుడు.

'నా పేరు సూర్యం. ఇంటికి పోదాంపదండి' అంటూ లేచాడతను.

'రాజా! ఇది చదవండి మీకు అంతా అర్థమవుతుంది.'

సూర్యం చేతులు వణుకుతున్నాయ్. రాజా ఆ కాగితాలు అందుకొనేటప్పుడు అతని హృదయం ఒక్కసారి చలించింది.

సూర్యంవంక చూశాడు రాజా. సూర్యం కళ్ళు అరమూతగా ఏదో విషయంగూర్చి ఆలోచిస్తున్నట్లున్నాయ్.

'వస్తా? సూర్యం' అంటూ బయల్దేరాడు రాజా.

ఇంటికి వచ్చిన రాజా దీపం వెల్గులో దాన్ని తీసి చదవసాగేడు.

*　　*　　*

అన్నయ్యగారింటికి బయల్దేరానా శెలవుల్లో. మొదటి రోజు ఇంట్లోంచి కదల్లేదు. రెండో రోజు గోదావరీతీరాన్ని బయల్దేరాను. చీకటి పడ్డాక యింట్లో బయల్దేరాను. ఇంటికి వచ్చాను. వదిన ఎవరో యువతితో మాట్లాడుతోంది. ఆమె ముఖం వంక చూశాను. ఆమె సౌందర్యం నన్ను ఏదో అనుభూతిలో ముంచివైచింది. అలా చూస్తూ నిలబడిపోయాను.

పక్కింటివారి అమ్మాయి 'విజయ' అన్న వదిన కంఠం నన్ను జాగృతావస్థలోకి తీసుకొనివచ్చింది.

'మా మరిది సూర్యం' అని పరిచయం చేసింది వదిన.

'నమస్కారమండీ' అందామె.

నాకు తెలియకుండానే ప్రతి నమస్కారం చేశాను.

'వస్తానండీ' అని ఆమె నామనస్సుతో పాటు వెళ్ళిపోయింది.

ఆ తరువాతి రోజు గోదావరి వడ్డుకి బయల్దేరాను. సమీపంనుండి బుల్ బుల్ మధుర స్వరం వినవస్తోంది. అటు చూశాను.

విజయ తన వడిలో బుల్ బుల్ పెట్టుకొని వాయిస్తోంది. ఆమెవైపు నడిచాను.

వాద్యాన్ని ఆపి 'మీరా' అందామె సిగ్గుగా.

'అవునండి. మీకు బుల్ బుల్ వాయించటం బాగానే వచ్చున్నమాట' అన్నాను.

'ఏదో వచ్చండి.' అందామె చేతితో యిసుకలో బొమ్మలు వేస్తూ.

'నాకు నేర్పుతారా' అన్నాను నేను.

ముందర కొంచెం సందేహించింది.

రెండు రోజులు మామూలుగా నడిచిపోయాయ్. మూడవ రోజు ఆమె వచ్చింది. ముఖంలో ఏదో దిగులూ, బాధా కన్పిస్తోంది. నాల్గోరోజు ఆమె ముఖం మరింత దిగులుగా కన్పించింది.

'అలా వున్నారేం' అన్నాను.

కొంచెం సర్దుకొని 'ఆహా! ఏమీలేదండీ!' అందామె.

ఇంటికి వెళ్తుంటే అడిగేను. ఆమె చెప్పేసింది.

'నిన్న మా నాన్నగారు మీతో వస్తూండగా చూసి కేకలేశారు, మొగవాళ్ళతో తిరగడమేమిటని? సమాధానం చెప్పాననుకోండి.'

ఆ మరునాడు గోదావరీతీరానికి వెళ్ళాను. ఈసారి ఆమె ముఖం మరీ దిగులుగా కన్పించింది. ఆరోజు పాట కావటంతో.—

'ఈ పాట పూర్తికాకపోతే' అంది విజయ నాకేసి దిగులుగా చూస్తూ.

'ఆ సంచేహం ఎందుకు కల్గింది' అన్నాను.

'ఆహా! ఏమీలేదు, సర్దాగా అన్నాను. అంది విజయ.

చీకటి పడేవరకూ కూర్చుని యింటికి బయల్దేరాం.

'ఎప్పుడన్నా మీ రెవరినైనా ప్రేమించారా' అడిగిందామె తల క్రిందకు దించుకొని.

'ప్రేమించాను' అన్నాను.

ఆమె కళ్ళలో నీళ్లు నిలిచాయి 'అలా ప్రేమించినవారు మాకు జీవితంలో యిక కన్పించనంతి దూరం వెళ్ళిపోతే, మీకు బాధగా వుండదూ' అందామె గద్గస్వరంతో.

'విజయా' అన్నాను. ఇంతటితో ఇల్లు దగ్గిర కావటంవల్ల నిష్క్రమించింది.

* * *

తెల్ల వారింది.

అప్పటినుంచీ నన్ను చూడగానే ముఖానంగా తప్పుకోవటం, గుసగుసలు ప్రారంభించారు; అందరూ.

రెండు రోజులు గడిచాయ్. అన్నయ్యా వదినల అప్యాయతలో లోపం కన్పించినట్లయింది. ఒకనాడు మధ్యాహ్నం అన్నయ్య నన్ను పిలిచాడు.

'చదువుకొన్నవాడివి. నీకు చెప్పగల్గింది ఏమీలేదు. ప్రాజ్ఞుడనయ్యాననుకొన్నాను. ప్రక్కఇంటి యువతితోనా సరసాలు. వాళ్ళది మరొక కులం. ఆ అమ్మాయిని అనుమానించి వరంగల్ పంపేశారు. పెళ్ళికిముందు ఫలానా సుబ్బారావుగారి తమ్ముడు అమ్మాయితో సరసాలాడేటంటే ఆ అమ్మాయికి పెళ్ళి ఎలా అవుతుంది.' అన్నయ్య మాటలు వింటూంటే అగ్నిపర్వతం బ్రద్దలయినట్లయింది.

మర్నాడు బట్టలు సర్దుకున్నా.

'వదినా, ఆ అమ్మాయినీ నన్నూ అనవసరంగా అనుమానిస్తున్నారు. ఇప్పుడు కాకపోయినా, కొన్నిఏళ్ళ కైనా తెలుస్తుంది. ఒకటి మాత్రం నిజం. నేను ఎక్కడికిపోతానో నాకు తెలియదు. తిరిగిమాత్రం రాను. అన్నయ్యకి నా ధన్యవాదాలని చెప్పు. నా గురించి నవ్వులపాలు కానక్కర లేదు. తనకు ప్రతిష్ఠ తెచ్చే తమ్ముడు అంతరించిపోయాడని చెప్పు' అని చెప్పి బయటకు వచ్చేశాను.'

'బాబూ! వెళ్ళిపోతున్నావా! వారువచ్చాక చెప్పివెళ్ళువు గాని! బాబూ' అంటున్న వదిన మాటలు గాలిలో కల్సిపోయాయ్!

అంతేకధ. ఆ తరువాత ఈ వూరు చేరాను.

'ఇంకా ఆ గీతం పూర్తికాలేదు' అన్న విజయమాటలు పూర్తిగా నిజమయింది నాదీ నిజమయింది. ఆ గీతం యిక పరిపూర్తి నొందదు... సెలవు.

రాజా పూర్తిగా చదివిన తరువాత అతని కళ్లు చెమ్మగిల్లాయ్. సూర్యం మీద సానుభూతి కల్గింది 'ఎంత సహృదయుడు' అనుకొన్నాడు రాజా.

ఉదయం సూర్యం యింటికి వెళ్ళాడు. అతనిభాగం తాళవేసి వుంది.

'సూర్యం లేడాండీ' అక్కడవున్న ముసలాయనను అడిగేడు.

'అవును బాబూ! సూర్యం ఏనాడూ ఎవ్వరినీ బాధపెట్టలేదు. ఆ సహృదయుడు వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు అద్దె వండా యిచ్చి వెళ్లేడు. నిజంగా అతన్ని మర్చిపోలేం బాబూ. నాకు యిప్పటికి 90 ఏళ్ళు వుంటాయి. అయినా నా 90 ఏళ్ళ జీవితంలోకూడా యిటువంటి వ్యక్తిని చూడలేదంటే అతిశయోక్తిలేదు. హూ? మర్చిపోలేం' అంటూ కళ్ళు తుడుచుకున్నాడా ముసలాయన.

'అవును మరిచేను. నీపేరు రాజాయా' అడిగేడాయన.

'అవునండీ' అన్నాడు రాజా.

'అయితే ఈ వుత్తరం నీకు యిమ్మని చెప్పేడు సూర్యం.

రాజా పరధ్యాన్నంగా అందుకున్నాడు ఆ ఉత్తరం. విప్పి చదివేడు.

'రాజా!

'పూర్తికాని గీతం' ఈపాటికి చదివి అర్థం చేసుకొనివుంటావ్. ఇన్నాళ్ళూ ఈ బాధను హృదయంలో దిగమ్రింగి అశాంతితో మ్రగ్గిపోయాను. ఇప్పుడు, పూర్తికాని ఆ గీతంతో నాకు విముక్తి లభించింది. నా భారాన్ని నీకు అప్పగించాను. ఈ గీతాన్ని మర్చిపో.

ఈ విషాద గీతాన్ని మర్చిపో రాజా.

ఇన్నాళ్ళూ నీవంటి ఒక మిత్రుడికోసం ఎదురుచూశా. నా కోరిక తీరింది.

ఈ పూర్తికాని గీతాన్ని ఇకముందు ఎన్నివేల హృదయాలు అర్థంచేసుకొని బాధతో కుమిలిపోతాయో. ఇక ఈ గీతం గీతతోటే అంతంకావాలి. నన్ను మర్చిపో రాజా!

జీవితంతో పోరాడి పరాజయాన్ని పొందిన ఒక అభాగ్య మిత్రుడు వుండేవాడనిమాత్రం జ్ఞాపకముంచుకో.

అది స్వల్పకాలంలో పరిచయమైన మన స్నేహం అమరమైనది రాజా.

ఎప్పుడైనా విజయ నీకు తారసపడితే ఆమెకు...

చిరకాలం సౌభాగ్యవతిగా వర్ధిల్లమని నా ఆశీర్వాదంగా చెప్పు.

ఇక నేను నిష్క్రమిస్తా.

శెలవు రాజా!

ఇట్లు,
సూర్యం.

'లేదు. నీది పరాజయంకాదు. విజయం నీదే, విజయం నీదే.'

అని గట్టిగా అరిచేడు రాజు బాధగా.

అతని కళ్ళనుంచి కారే అశ్రుబిందువులు వుత్తరాన్ని తడుపుతూంటే అచేతనుడై పోయాడు రాజు.

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.